# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక




పార్టీకి నష్టం కలుగుతుంటే ఊరుకోం..

3

సంపుటి : 01 | సంచిక : 256 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 23 ఆగస్టు 2026 | పేజీలు :4



## పార్టీ హద్దు మీరితే చర్యలు తప్పవు

- డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ
- కంచె రాములు 48 గంటల నిరాహార దీక్ష విరమణ

2 లో



# మానవీయ కోణంతో రేషన్ పథకం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జనగామ, మన చౌరాస్తా :** మానవీయ కోణంలో అమలు చేస్తున్న గొప్ప పథకం సన్న బియ్యం పంపిణి పథకం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఉచిత సన్న బియ్యం పంపిణి జరుగుతందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పేద ప్రజల పట్ల ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి చేయాలన్నారు. బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తారు కానీ పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టరని విమర్శించారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ పథకాలను చూసి బిఆరఎస్ ఓర్వలేక పోతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆరఎస్ నాయకులు దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఎన్నికలు ఏవైనా నిజాయితీగా ఉండే వారిని, ప్రజల కోసం పని చేసే వారిని ఎన్నుకుంటేనే గ్రామంలో అయినా, నియోజకవర్గంలో అయినా అభివృద్ధి జరుగుతుందని కడియం శ్రీహరి సూచించారు.. వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో, ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన వేలేరు, ధర్మసాగర్ మండలాలకు సంబంధించిన కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అత్యంత భద్రతా ప్రమాణాలతో జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బిఆరఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం ఎక్కడో ఆదిలాబాద్ లో సంజీవ రెడ్డి అనే వ్యక్తికి ఇతర కాంగ్రెస్ నాయకులకు గొడవ జరిగితే అది కడియం శ్రీహరిపైనే జరిగింది అని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇంత దుర్మార్గంగా అబద్దపు వార్తలు చేయడం బిఆరఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. బిఆరఎస్ పార్టీ కొన్ని యూట్యూబ్ ఛానల్స్ కొని నెల జీతాలు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, నాయకులపై సంబంధంలేని, స్జబెక్ట్ లేని వార్తలతో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. నా 35ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరి దగ్గర రూపాయి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తున్నాని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా సన్న బియ్యంతో పాటు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులు పంపిణి చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమే అని చెప్పారు. తెలంగాణ చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. ఏడాదికి 13వేల 800కోట్ల ఖర్చుతో కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఒక్కరికి 6కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణి చెస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్న బియ్యం పంపిణి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల ఖర్చుతో చేపట్టే కార్యక్రమానికి మోడీ ఫొటో ఎలా పెడతారని ప్రశ్నించారు. పేద ప్రజల కడుపు నింపాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉంటే దేశ వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. బడా బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తారు కానీ పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టారని ఇది మంచి పద్ధతి కాదని విమర్శించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద ప్రజల పక్షాన, రైతుల పక్షాన, మహిళల పక్షాన నిలబడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. కార్యక్రమంలో వేలేరు, ధర్మసాగర్ మండలాల సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, మండల నాయకులు పాల్గొన్నారు.


wanted

విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# హద్దు మీరితే చర్యలు తప్పవు

- **డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ**
- **కంచె రాములు 48 గంటల నిరాహార దీక్ష విరమణ**





**జనగామ, మన చౌరాస్తా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జనగామ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచ రాములు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్ష శనివారంతో ముగిసింది. ధన్వంతి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఆయన నిమ్మరసం తాగి దీక్షను విరమించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సంస్థాగత ప్రతిష్టను దెబ్బతీసే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.

**నాయకత్వంపై వ్యాఖ్యలు సరికావు – డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్**

దీక్షకు సంఘీభావం తెలిపిన వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో గుర్తింపు కోసం విచక్షణ కోల్పోయి మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యంతో పాటు క్రమశిక్షణకు కూడా అంతే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

**కొండా కుటుంబంపై చర్యలు తీసుకోవాలి: కంచ రాములు**

దీక్ష విరమణ అనంతరం కంచ రాములు మాట్లాడుతూ తన డిమాండ్లను వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మితను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇతర నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటూ ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. కొమురవెల్లి, కొడవటూరు, సిద్ధులగుట్ట దేవస్థానాల చైర్మన్ పదవులను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడంపై విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ రాజమౌళి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాజిద్ అప్సర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతకింది మల్లేష్, జాయ మల్లేష్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇస్మాయిల్, మేకల సమ్మయ్య, మోతె మల్లేశం, అజారుద్దీన్, గంధమల్ల కమలాకర్, మణి, పోతర్ల ఉప్పలయ్య యాదవ్, నోముల సోమయ్య, బోరెల్లి సిద్ధులు, బాల్దే శ్రీశైలం, అలీమొద్దీన్, మంగ లక్ష్మణ్, అల్వాల రమేష్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



# వైద్యశాఖ మంత్రిని కలిసిన విప్ బీర్ల

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి లడ్డు ప్రసాదాన్ని మంత్రికి అందజేశారు. అనంతరం ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.



# శామీర్ పేటలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీల నియామకం

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** టీపిసిసి ఆదేశాల మేరకు, జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సూచనలతో జనగామ మండలం శామీర్ పేట గ్రామంలో నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల కమిటీల బాధ్యులను నియమించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ శ్రీధర్ రెడ్డి, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు సర్వల నర్సింగ రావు, మాజీ SC సెల్ జిల్లా అధ్యక్షులు గానిపాక మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుగు బాలరాజు హాజరయ్యారు.

**నూతన కమిటీ అధ్యక్షుల వివరాలు**

గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు : సాదం రమేష్ యాదవ్


- గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు: గద్ద నరేష్
- కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు: కంసాని భాస్కర్ రెడ్డి
- బీసీ సెల్ అధ్యక్షులు: జిట్టె బాలకుమార్
- SC సెల్ అధ్యక్షులు: తాండ్ర నర్సింగరావు
- మైనారిటీ సెల్ అధ్యక్షులు: సయ్యద్ యాకుబ్ పాషా
- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు: కడకంచి లక్ష్మి

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సాధం మధుసూదన్ యాదవ్, AMC డైరెక్టర్ నామాల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఆవుల రమణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాష్ యాదవ్, మాజీ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ గొండ కృష్ణ రెడ్డి, జినుకల రాజు, సీనియర్ కాంగ్రెస్ నేతలు కడకంచి వీరమల్లు, కన్నెబోయిన కొమురెల్లి, బత్తుల లక్ష్మీనారాయణ, గద్ద లక్ష్మణ్, సాదం జంపన్న, చిన్న, మెరుగు గణేష్, తాండ్ర కమలాకర్, తేల్జేరు వెంకటేష్, వార్డు మెంబర్లు గద్ద నవీన్, గణేష్, నాగరాజ్ పాల్గొన్నారు.

అలాగే యూత్ కాంగ్రెస్ నాయకులు తొగరు పృథ్వీరాజ్, కాల్వ నాగరాజ్, జిల్లెల కనకరాజు, కరుణాకర్, సందీప్, మహేష్, సంపత్, నవీన్లతో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# కళలను పరిరక్షించాలి : డాక్టర్ మాచర్ల భిక్షపతి

- **ఘనంగా శ్రీకృష్ణ రాయభారం పద్యనాటక ప్రదర్శన**

**జనగామ, మన చౌరాస్తా :**

జనగామ శ్రీ వెంకటేశ్వర కళా పరిషత్ ఆధ్వర్యంలో బాణాపురం శ్రీ హనుమాన్ దేవాలయంలో "శ్రీకృష్ణ రాయభారం" పద్యనాటక ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగింది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవంతో సాగిన ఈ కార్యక్రమంలో పద్యనాటకంతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మాచర్ల భిక్షపతి హాజరుకాగా, విశిష్ట అతిథులుగా బాణాపురం శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ప్రధాన అర్చకులు సంపత్ కుమారుల కృష్ణమాచార్యులు, ఆంజనేయ స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ బజాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ మాచర్ల భిక్షపతి మాట్లాడుతూ.. అంతరించిపోతున్న సాంప్రదాయ కళారూపాలను, నాటక రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కళలు, సాహిత్యం, సంగీతం, నాట్య సంప్రదాయాలు మన గొప్ప సంస్కృతికి నిదర్శనాలని పేర్కొన్నారు. పిల్లలను చిన్నతనం నుంచే భారతీయ కళలు, సంస్కృతి వైపు ప్రోత్సహించడం ద్వారా మన కళా వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించవచ్చని పిలుపునిచ్చారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు**

కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణ రాయభారం పద్యనాటకంతో పాటు శ్రీ శారదా స్వరలహరి బృందం ఆలపించిన భక్తిగీతాలు ప్రేక్షకులను పరవశింపజేశాయి. అలాగే జనగామ గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రశంసలు అందుకుంది. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కళా పరిషత్ ముఖ్య సలహాదారు మోతే సురేందర్ రెడ్డి, అధ్యక్షులు అప్పయ్యశాస్త్రి, కార్యదర్శి నాగరాజు శర్మ, కోశాధికారి రాజా నరసింహారెడ్డిలతో పాటు గౌతమ్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

- **కాంగ్రెస్‌కు నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోం..**
- **పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కొండా సురేఖ విషయంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. కొండా సురేఖ వివరణ చదివామని తెలిపారు. కొండా సుస్మిత మాటల వీడియోలను చూశామని చెప్పారు. ముఖ్యమంత్రిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. మంత్రి సురేఖ వివరణపై మరోసారి సమావేశం కావాలని భావించామన్నారు. క్రమశిక్షణ కమిటీకి మరి కొందరు ఎమ్మెల్యేలు మరిన్ని వివరాలు ఇస్తామన్నారని చెప్పారు. అలాగే, చిన్నారెడ్డి వివరణ లేఖ చదివామని మల్లు రవి అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యల వీడియోలు చూశామని తెలిపారు. చిన్నారెడ్డి విషయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డితో మాట్లాడతామని అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలకు, మేఘారెడ్డి ఫిర్యాదుకు చాలా అంతరం ఉందని చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడిన అంశాలు తనకు తెలుసని.. కానీ ఒక ప్రాసెస్ ప్రకారం విచారణ ఉంటుందని మల్లురవి తెలిపారు. ఆయా వ్యక్తులపై తమకు ఎలాంటి అభిప్రాయం ఉండదని చెప్పారు. పార్టీనే తమ మొదటి ప్రాధాన్యం అని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ వివరణ లేఖ తమకు అందిందని మల్లు రవి తెలిపారు. తన వ్యాఖ్యలపై కంది శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారని అన్నారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిని ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేశామని చెప్పారు. కంది శ్రీనివాస్ రెడ్డి అంశాన్ని సైతం మరోసారి కూర్చొని మాట్లాడతామని మల్లు రవి పేర్కొన్నారు.

# పూర్తిస్తాయి వైద్య కేంద్రాలుగా కమ్యూనిటీ ఆస్పత్రులు

- **వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వ్యాఖ్యానించారు. జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనూ మేజర్ సర్జరీలు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి దామోదర్ మాట్లాడారు. టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లా, ఏరియా ఆస్పత్రులు, 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తామని చెప్పారు. చిన్న సమస్యలకే పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయొద్దని ఆదేశించారు. అవసరమైతేనే పేషెంట్లను పై స్థాయి ఆస్పత్రులకు రిఫర్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. అత్యవసర రిఫరల్‌కు ముందు సంబంధిత ఆస్పత్రికి సమాచారం ఇవ్వాలని సలహా ఇచ్చారు. అవసరమున్న ఆస్పత్రుల్లో కొత్త సీటీ స్కాన్లు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతామని అన్నారు. పరికరాల ప్రతిపాదనలకు రోగుల సంఖ్య, అవసరంపై జస్టిఫికేషన్ తప్పనిసరని చెప్పారు. డీసీహెచ్‌ఎస్‌లు వారానికి కనీసం ఒకరోజు ఆకస్మిక తనిఖీలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్‌లు విధులకు గైర్హాజరు, విధుల నుంచి ముందే వెళ్లిపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా ఆస్పత్రుల్లో సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అన్నారు. పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వేస్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రతి నెలా డీసీహెచ్‌ఎస్‌ల వర్క్ రిపోర్ట్ ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

# కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

- **వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి**
- **మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్**




**సిరిసిల్ల, మన చౌరాస్తా :** తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆరఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్ తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నాయని అన్నారు. రెండు నెలల క్రితమే బీఆరఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సందర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించారని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగంలోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని విమర్శించారు.కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శించారు. కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద రూ.100 కోట్ల తో కాఫర్ డ్యాం కట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు. కేసీఆర్ దూర దృష్టితో కాళేశ్వరం కట్టారని గుర్తు చేశారు.



# రోడ్లు, బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

**అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** రాష్ట్రంలో సీఆరఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, రైలు ఓవర్ బ్రిడ్జ్ పనుల్లో వేగం పెంచాలని ఉన్నతాధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. శనివారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా పనుల పురోగతి మరింత మెరుగుపడాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 3,918 కి.మీ రోడ్లకు రూ.5,159 కోట్లతో 316 పనులు మంజూరు అయ్యాయని వివరించారు. 2025`26లో రూ.868 కోట్లతో 422.36 కి.మీ రోడ్ల పనులు చేపట్టామని తెలిపారు. హై లెవెల్ బ్రిడ్జిలు, పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మిర్యాలగూడ, నంది పహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో మరింత కష్టపడి పని చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిసెంబర్ నాటికి సచివాలయంలో సోలార్ కార్ పార్కింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో సోలార్ కార్ పార్కింగ్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సోలార్ పార్కింగ్‌తో సచివాలయానికి 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. దీంతో నెల వారీ విద్యుత్ బిల్లులో 16 శాతం ఆదా అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# దానం నాగేందర్ అన్హత పిటిషన్

**తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆరఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆరఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆరఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆరఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కడియంకు రైతుల వినతి

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లా వేలేరు మండలంలోని రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆరఎస్ మండల నాయకులు, రైతులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని సాగు భూములకు గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగవంతం చేయాలని కోరారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం కోసం ఎత్తిపోతల పథకాలు, పైప్‌లైన్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలేరు మండలానికి గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందించి రెండు పంటలకు సాగునీరు కల్పిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారావు, సర్పంచ్ మరిజె అనిత, నాయకులు విజేందర్ రెడ్డి, జానీ, హరీఫ్ పాల్గొన్నారు.



# చిరు 'కాకా'

## బడర్త్‌డే సందర్భంగా టైటిల్ రిలీజ్

అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరంజీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయనకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది .

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**